
# అనుమానం

-కొంగే సుధాకరరావు



అప్పారావ్ నేను పనిచేసే ఆఫీస్‌లో ప్యూన్. చాడీలు చెప్పి కలహ భోజనం చేసే అపరనారదుడి లాంటి అప్పారావ్‌కు తన గొర్రెతోక లాంటి జీతం తన త్రాగుడు వ్యసనానికి సరిపోదు. అందుకే కనిపించిన ప్రతివాడి దగ్గర అప్పు పుట్టించే నైపుణ్యం అప్పారావ్‌కు వెన్నతో పెట్టిన విద్య.

అతడు అప్పుడప్పుడు నా దగ్గర తీసుకున్న అప్పు ఇంతింతై.... వటుడింతయై.... లాగా పెరిగి పదివేల దాకా పెరిగింది. వాటిని తీర్చే మాట అటుంచి ఆ రోజు పొద్దున్నే నా దగ్గరకు వచ్చాడు.

"నమస్కారం సార్" అన్నాడు నెత్తి గోరుక్కుంటూ

"ఏంటి ఇవాళ త్వరగా వచ్చావ్ ఆఫీసుకు" అడిగాను.

"రేపు మా బాబు పుట్టిన రోజు సార్! ఈ రోజు త్వరగా పని పూర్తి చేసుకుని ఇంటికెళదామని త్వరగా వచ్చా" అన్నాడు మరోసారి ఎడమచేత్తో నెరిసిన తల గోక్కుంటూ.

"సరే! బాస్‌తో చెప్పి పని చూసుకుని వెళ్ళు" అన్నాను అకౌంట్స్ పుస్తకాల్లోకి తలదూరుస్తూ.

"బాస్ ఎప్పుడో ఒప్పుకున్నారండీ!"

"అయితే ఇక వెళ్ళవోయ్" అన్నా విసుగ్గా.

"సార్! రేపు మా బాబు పుట్టిన రోజు కదండీ! ఓ రెండు వందలు కావాలి. జీతం వచ్చాక మీ డబ్బు పూవుల్లో పెట్టి ఇస్తా" అన్నాడు. ధనుర్వాతం వచ్చిన వాడిలా మూడు వంకర్లు తిరుగుతూ.

"అప్పారావ్! ఇక నా చెవుల్లో పూవు పెట్టవద్దు. నా దగ్గర డబ్బుల్లేవు. ఇక దయచేయ్" - అన్నా కేలిక్యూలేటర్‌తో కూడిక చేస్తూ. కాసేపు చూసి, ఇక లాభం లేదని తెలిశాక మౌనంగా వెళ్ళిపోయాడు అప్పారావ్. నేను కాస్త రిలీఫ్‌గా ఫీలయ్యా. అప్పటికే సాయంత్రం 5 గంటలయింది. గోడ గడియారంలో గంట కొట్టిన శబ్దం వినిపించింది. ఆఫీస్ టైం ముగియడంతో ఫైళ్ళు, పుస్తకాలన్నీ బీరువాలో సర్ది, తాళం వేసి, తాళం చెవుల్ని పేంటు జేబులో పడేసుకుని, బయటికి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేశా. రోటరీ క్లబ్ వైపుగా బండిని పరుగెత్తించా. రోటరీ క్లబ్ మెంబర్‌గా సమాజ సేవ చేయడం నా హాబీగా పెట్టుకున్నా. క్లబ్ పని ముగిసేసరికి ఒక్కోసారి రాత్రి పది ధాటేది. ఆ రోజు పదకొండయింది. ఇంటికి వెళ్ళా. శ్రీమతి విసురుగా విసుగ్గా తలుపులు తెరచింది. ప్రతి రోజూ ఇంత ఆలస్యమైతే ఎలా అన్న భావం ఆమె ముఖ కవళికల్లో కన్పిస్తోంది.

స్కూటర్ వరండాలో పార్క్ చేసి ఇంట్లోకి ప్రవేశించా.

"ఇంత రాత్రి ఎక్కడికెళ్ళారు" చురచుర చూస్తూ ఆఫీసర్‌లా ఇంటరాగేట్ చేసే ఫక్కీలో అడిగింది శ్రీమతి. నా హెల్మెట్ అందుకుంటూ.

"క్లబ్ పనుల్లో టైం ఎంతయిందో తెలియనేలేదు" అన్నా- లుంగీలోకి మారుతూ. కాళ్ళు కడుక్కున్నా.

"ప్రతి రోజూ ఇంత ఆలస్యమైతే ఇక ఇంటికి రావడం ఎందుకు? ఆ క్లబ్‌లోనే పడుకోవచ్చుగా" అంది శ్రీమతి. కంచంలో విసురుగా అన్నంలోకి

సాంబారు పోస్తూ. నేను మౌనంగా భోజనం అయిందనిపించా. బెడ్ రూంలోకి ప్రవేశించానో లేదో మా శ్రీమతి మళ్ళీ ఇంటరాగేషన్ మొదలు పెట్టింది.

"ఇంత రాత్రి పూట ఎక్కడికెళ్ళి వచ్చారు?" మళ్ళీ అదే ప్రశ్న.

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు! రోటరీ క్లబ్ మెంబర్‌ని కావడం వల్ల సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా, అది కూడ తప్పేనా" అన్నా బెడ్ పై కూర్చుంటూ.

"సమాజ సేవ చేస్తున్నారా? లేక సానిసేవ చేస్తున్నారా?" ఈసారి మరింత కటువుగా అడిగింది శ్రీమతి మల్లిక.

"మల్లీ! నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలిసిందా!"

"ఆ తెలుసు! ఇంతసేపు ఏ సాని కొంపలో ఉన్నారు" అని అడుగుతున్నా."

"చూడు మల్లీ! ముందే చెప్పానుగా! క్లబ్ మెంబర్లమంతా కలసి సమాజసేవ చేసే కార్యక్రమం చేపట్టామని. ఈ కార్యక్రమం ఓ మూడు నెల్ల పాటు సాగుతుంది. కాస్త ఆలస్యమైతే.... ఆ మాత్రానికే ఇంత గొడవ చేయాలా?" నిలదీశాను కోపంతో.

"గొడవ కాదండీ! గోడు! ఇంట్లో ఇల్లాలు ఒంటరిగా దిగులుగా వేచి ఉంటుందన్న జ్ఞానం లేదూ! మీరు ఎక్కడ తిరిగి వచ్చారో నాకు తెలుసు. అది తెలిసినప్పటి నుంచి నా సంసారం ఎక్కడ కూలిపోతుందోనని నా బాధ" అంది చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

"మల్లీ ప్లీజ్! నీవేం మాట్లాడుతున్నావో నాకు ఏమీ అర్థం కావడం లేదు" అన్నా భ్రుకుటి ముడుస్తూ.

"మీకెలా తెలుస్తుంది? అన్నీ చేసి కూడ ఏమీ తెలీని నంగనాచిలా నటిస్తున్నారు."

"మల్లికా" గర్జించాను క్రోధారుణ నేత్రాలతో ఆమె వైపు చూస్తూ కోపంతో వణికి పోతూనే మళ్ళీ అడిగా.

"చెప్పు! నీకు తెలిసిందన్నావుగా. నేనెక్కడికి వెళ్ళానో చెప్పు"

"సిటీలో మీరు ప్రతి రోజూ రెడ్ లైట్ ఏరియాకు వెళుతున్నారు కదూ" అడిగింది నా శ్రీమతి మల్లిక.

నేను ఆశ్చర్యపోయాను. ఈమెకీ విషయం ఎలా తెలిసింది. అన్న విషయం అర్థమే కావడం లేదు. నాకు మా ప్యూన్ మీద కొంచెం అనుమానం కలిగింది. వాడు రోజూ నన్ను బాగా అబ్జర్వ్ చేసి ఈ విషయం కనుక్కున్నాడనిపించింది. అయినా అడిగాను.

"ఎవరు చెప్పారు నీకు?"

"ఎవరు చెబితేనేం. ఇది నిజమా? కాదా?"

"అవును వెళుతున్నా. కాని అందరూ దేనికోసం వెళతారో నేనందుకోసం వెళ్ళడం లేదు."

"ఆహాహా! అబద్దాన్ని అందంగా చెప్పడం అంటే మీ నుండే నేర్చుకోవాలి! సారాయి కొట్టుకు వెళ్ళింది పాలు తాగడానికంటే ఎవరైనా నమ్ముతారా?"

"నేను సమాజ సేవ కోసం వెళుతున్నా..." పూర్తి విషయం వినడానికి ముందే మా ఆవిడ మళ్ళీ అంది.

"సానికొంపలో ఏం సమాజ సేవ చేస్తారో ఊహించలేనంతటి వెర్రిదాన్ని కాదు నేను"

"అవును. నా ఇష్టం వచ్చిన చోటికే వెళతా. నా ఇష్టం" అని చెప్పి మౌనంగా ఉండిపోయా. ఆ రోజు రాత్రంతా మా ఇద్దరి మధ్య గంభీర మౌనం. తుఫాను ముందుటి ప్రశాంతిలా అనిపించింది. మరుసటి రోజు నేను లేచేసరికి మా ఆవిడ తాను పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ రోజు మూడ్ బాగోలేదు. ఆఫీస్‌కు సెలవు చీటి పంపించాను మరో ప్యూన్ ద్వారా. అంతలో ఆఫీస్ కొలీగ్ శేఖర్ ఆ రోజు మా ఇంటికి వచ్చాడు. స్కూటర్ పార్క్ చేసిన శబ్దం వినిపించింది. మిత్రుడికి స్వాగతం పలికా:

"రా! శేఖర్ కూచో" అన్నా కుర్చీ చూపిస్తూ.

"ఏంటి ఇవాళ ఆఫీస్‌కు వెళ్ళలేదా! ఒంట్లో బాలేదా" అడిగాడు శేఖర్ కుర్చీలో కూర్చుంటూ.

"తల నొప్పిగా ఉంటే ఇంట్లోనే ఉండిపోయా. ఆఫీస్‌కు రానని మా బాస్‌కు ఫోన్‌లో చెప్పేశా" అన్నా.

"వదిన ఇంట్లో లేదా?" శేఖర్ ప్రశ్నించాడు.

"ఆమె పుట్టింటికి వెళ్ళింది. ఇండెఫినెట్ లీవ్." అన్నా. శేఖర్ నా జోక్‌కి నవ్వాడు.

ఉన్నట్టుండి ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా శేఖర్ అన్నాడు.

"ఆఁ అన్నట్టు మొన్న అప్పారావ్ నా దగ్గరికి వచ్చాడు."

"మళ్ళీ అప్పులేమైనా అడిగాడా?"

"వంద రూపాయలుంటే ఇమ్మన్నాడు." భార్యకు ఏదో జబ్బట. మందులకి కావాలని అడిగాడు."

"ఇచ్చావా?"

"వందే కదా అని ఇచ్చేశా. అయితే వాడు ఓ విషయం నా దగ్గర చెప్పాడు.

"ఏంటి?"

"నువ్వు రెండొందలు అడిగితే ఇవ్వలేదటగా"

"ఔను. ఇది వరకే పాత బాకీ కొండంత పెరిగింది. వాడి తాగుడికి మరింత డబ్బు తగలేయడం ఎందుకు అని ఇవ్వలేదు."

"కొంప మునిగింది. వాడు వదినగారి దగ్గరకు వచ్చాడట."


"ఏం డబ్బు అడగడానికా?"

"కాదు. నువ్వు రోజూ రెడ్ లైట్ ఏరియాలో తిరుగుతున్నావని చెప్పడానికి" శేఖర్ మొఖంలో కూడ అనుమానపు ఛాయలు కన్పించాయి.

"చూడు శేఖర్! రోటరీ క్లబ్ మెంబర్స్ అంతా కలిసి ఎయిడ్స్ రోగం గురించి వేశ్యలకు వివరిస్తున్నాం. వాళ్ళ దగ్గరకు వచ్చే మగవాళ్ళకు కండోమ్‌లు వాడేట్లు బలవంతం చేయాలని నచ్చజెప్పి ఉచితంగా కండోమ్స్ సరఫరా చేస్తున్నాం. ఇది మేం చేస్తున్న సమాజ సేవ. ఇదంతా ఆ ప్యూన్‌గాడికి ఏం అర్థమౌతుంది?"

"మైగాడ్! ఇదా నువ్వు చేసే పని! సారీ! నేనూ నిన్నపార్థం చేసుకున్నా సుధాకర్! అయితే వాడి తిక్క రేపు ఆఫీస్‌లో కుదిరిస్తాగాని వదినగారికి ఈ విషయం తెలియజేస్తా ఫోన్ ద్వారా" అంటూ శేఖర్ వెళ్ళి పోయాడు మా ఆవిడకు ఫోన్ చేసేందుకు.

నా హృదయం కొంత తేలికపడింది. మౌనంగా నింగికేసి చూస్తూ నిల్చున్నా. పైన ఆకాశం అనుమానాల్లాంటి మేఘాలు మాయమైన అంతరంగంలా నిర్మలంగా తోచింది. అప్పారావ్‌ను బాగా మందలించాను. అమ్మగారు వచ్చాక తాను చెప్పింది అబద్ధమని చెప్పేందుకు అప్పారావ్ అంగీకరించాడు. మా ఆవిడ రాక కోసం తీయగా ఎదురు చూస్తూ ఉండిపోయా. ❋



## లాజిక్

మీసం చూసి నన్ను విలన్ అనుకోకండోయ్. నేను కమెడియన్నే. గెటప్‌లో వెరైటీ కోసం ఈ సెటప్ ఎరేంజ్ చేశారు అంటున్నాడు మల్లికార్జునరావు.

మీరు గెటప్‌లు మార్చటం వరకేనా ఏదయినా వెనుకేసుకున్నారా? అని అడిగితే అలా వెనుకేసుకుంటే ఇంకా ఎందుకు మీతో ఇలా మాట్లాడతాను? డబ్బులెక్కువవుతున్న కొద్దీ మనిషికి మాట పడిపోతుంది అంటాడు మల్లికార్జునరావు.